# పుస్తక పరిచయం




**Published by :**

Ushasri Mission
Radio Artistes Colony
Vijayawada - 520 008
www. ushasri.com

1974 నుంచి దాదాపు ఒక దశాబ్దం పాటు అశేష ఆంధ్ర శ్రోతలనీ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి కట్టిపడేసిన కార్యక్రమం – ధర్మ సందేహాలు(వ్యాసపీఠం). ఆ కార్యక్రమం అంత ఆసక్తికరం కావడానికి ముఖ్యకారణం శ్రీ ఉషశ్రీ – ఉషశ్రీగారి గంభీరగళం, అనితరసాధ్యమైన కథనశైలి. ఆ రోజుల్లో ఆదివారం మధ్యాహ్నం ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ఈ కార్యక్రమం ప్రసారమయ్యే సమయంలో ఏ పూటకాపూట సంపాదించుకుంటే కానీ రోజుగడవని రిక్షా వాళ్ళు కూడా బేరం దొరికినా రిక్షా కట్టేవారు కాదు, కార్యక్రమం పూర్తయేవరకూ. ఏ కిళ్ళీ కొట్టు దగ్గరో చేరి, భక్తిశ్రద్ధలతో 'ధర్మసందేహాలు' కార్యక్రమం విన్నాకనే బేరం చూసుకునేవారు. అంతగా పామరులనీ పండితులనీ సమంగా ఆకర్షించింది ఆ కార్యక్రమం. ఆ ఆకర్షణ ఎంతంటే – నాలుగు దశాబ్దాల తర్వాత ఈ రోజుకి కూడా రామాయణ, భారతాల ప్రవచనాలంటే ఉషశ్రీగారినే గుర్తుచేసుకుంటున్నారు. ఉషశ్రీ గళానికి ఉన్న శక్తి కలానికి కూడా ఉంది. ఉషశ్రీ రాసిన రామాయణ, భాగవత, భారత కథలని చదువుతోంటే విన్నట్లే ఉంటుంది. ఆయన కలం నుండి జాలువారిన రచనలు ఒక్కొక్కటీ ఎన్నో లక్షల ప్రతులుగా ప్రజల దగ్గరకి చేరి వాళ్ళ ఇళ్ళల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఉషశ్రీగారి సాహిత్యాన్ని ఈ తరానికి అందించడంలో విశేషమైన కృషి చేస్తున్నారు, వారి కుమార్తె డా.గాయత్రీ దేవిగారు.

'నాన్నగారి జ్ఞాపకాలు' శీర్షికలో డా.గాయత్రీదేవిగారు ఉషశ్రీగారి జీవితాన్ని ఈ తరం పాఠకులకు 'కౌముది' ద్వారా 2016 జనవరి నుంచి 2017 డిసెంబర్ వరకూ అందించారు . వ్యాస సంపుటికి పుస్తకరూపమే ఈ "ఉషశ్రీ - ఇంతింతై వటుడింతై" డా.గాయత్రీదేవిగారి భర్త, ఉషశ్రీగారి మేన-అల్లుడు అనామకుడుగారి కథనం అత్యంత ఆసక్తికరంగా సాగింది. ఆయన ముందుమాటలో చెప్పినట్లే "ఉషశ్రీ జీవనరేఖలు తెలిస్తేనేగానీ ఆయన కలంలో అంతమంది మనుషుల్ని కట్టుకుని వాళ్ళ మనస్సుల్ని కట్టిపడేసే వేగం, పదునూ, ఆకర్షణా ఎలా వచ్చాయో తెలీదు. ఆలమూరు గట్లమీద బెరుకుగా తిరిగిన కుర్రాడు - అందరినీ ఆకట్టుకునే ఉపన్యాసకుడుగా ఎలా పెరిగాడో తెలియదు. ఉషశ్రీ సామాన్యమైన మనిషికాదు. ఐతే అలా అసామాన్యుడిగా ఎలా ఎదిగారన్నది చాలా మందికి తెలియని కథ" చాలామందికి తెలియని కథను అందరినీ ఆకట్టుకునే విధంగా అందించిన కథనం ఈ పుస్తకం. అరుదైన ఛాయాచిత్రాలు, ఉషశ్రీగారి సాహితీ వ్యాసంగం వివరాలు, ఉషశ్రీ మిషన్ కార్యక్రమాల వివరాలు - ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణలు.

***




**అమెరికాలో** తొలితరం రచయిత్రి సోమ సుధేష్ణగారు. వారు వ్రాసిన కథలు, గేయాలు, పద్యాలు, వ్యాసాలు చాలావరకు వార్తావాహిని, తానాపత్రిక, తెలుగుజ్యోతి, తెలుగునాడి, అమెరికాభారతి లాంటి అమెరికలో ప్రచురితమయ్యే పత్రికల్లోనూ, రచన లాంటి ప్రతిష్ఠాత్మకమైన పత్రికల్లోనూ ప్రచురించబడ్డాయి. ఈ నవల 'నర్తకి', పదిహేనేళ్ళ క్రిందట వంగూరి ఫౌండేషన్వారు నిర్వహించిన నవలల పోటీలో బహుమతి పొందింది. తరువాత 'రచన' మాసపత్రికలో సీరియల్‌గా వచ్చింది. మళ్ళీ క్రిందటి సంవత్సరమే వంగూరిఫౌండేషన్ వారి ప్రచురణలోనే 10వ అమెరికా తెలుగు సాహితీ సదస్సులో పుస్తకరూపంలో విడుదలై మరింతమంది పాఠకులకు చేరువైంది. పూర్తిగా అమెరికా జీవన నేపథ్యంలో వచ్చిన తెలుగునవలల్లో ఇది ఒకటి అని చెప్పవచ్చు. దశాబ్దాల క్రిందట అమెరికా వెళ్ళి స్థిరపడిన తెలుగు కుటుంబాల తొలిరోజుల ఘర్షణను అత్యంత నిశితంగా చిత్రీకరించారీ నవలలో. కొత్తసమాజంలో ఇమడడంలో ఉన్న చిన్నచిన్న సమస్యలు, స్థిరత్వంలేని ఉద్యోగాలు, పరాయిగడ్డమీద నిలదొక్కుకోడానికి ఎదుర్కోవాల్సిన సమస్యలు వీటితో మొదలై కథకి కీలకాంశమైన పిల్లలు, చదువులు, అభిరుచులు .. వీటి మీదుగా ముందుకి సాగుతుందీ నవల. నిర్మల, రమేష్ అమెరికాలో స్థిరపడిన తెలుగు దంపతులు. వారికి ఇద్దరు సంతానం - సుష్మ, సుజన. చిన్నప్పటినుంచి ఎంతో ఆసక్తి ఉన్న, తాను నేర్చుకోలేకపోయిన నాట్యరంగం వైపు పెద్దమ్మాయిని ప్రోత్సహించడం, అందుకు తగినట్లుగానే సుష్మ అమెరికన్ బాలే డాన్స్‌లో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకుంటుంది. తనతో పాటు నాట్యప్రదర్శనల్లో పాల్గొనే అమెరికన్ డేవిడ్‌ని వివాహం చేసుకుంటుంది. తల్లిదండ్రులూ కూతురు నిర్ణయాన్ని గౌరవిస్తారు. ప్రేమ వివాహమైనా మధ్యలో తలెత్తిన ప్రొఫెషనల్ జెలసీతో సుష్మకు కొంతకాలం దూరమైన డేవిడ్, తిరిగి సుష్మను చేరుకోవడం నవలకు ముగింపు. సుధేష్ణగారు ఈ నవలను వ్రాసిన విధానం అద్భుతంగా ఉంది. ముఖ్యంగా పాఠకులకు చక్కటి కథను చెప్పే శైలి ఎవరో ఆత్మీయులు పక్కనే కూర్చుని తమ అనుభవాలను వివరిస్తున్నట్లుంటుంది. సందర్భానుసారం రచయిత్రి వ్యాఖ్యానించిన నిత్యజీవిత సత్యాలు అమెరికన్ జీవితానికే కాక ఏ సమాజంలోని మానవ సంబంధాలకైనా వర్తిస్తాయి. నవల చదవడం ప్రారంభించాక ఎక్కడా ఆపకుండా చివరికంటా ఆసక్తికరంగా కొనసాగిస్తుంది. 'రచన' పత్రికలో ప్రచురితమైనప్పటి బొమ్మలను కూడా అక్కడక్కడా చేర్చడం పుస్తకానికి అదనపు ఆకర్షణగా నిలిచింది. ★★★

**Published by:**

Vanguri Foundation of America
PO Box 1948 , Stafford, TX – 77497
Phone: 832 594 9054

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**